సాక్షి
నారాయణపేట
శనివారం । 16 । మార్చి । 2024



..రెండూ దోపిడీ పార్టీలే

దేశంలో కాంగ్రెస్, బీజేపీ రెండూ దోపిడీ పార్టీలేనని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు.

వివరాలు 8లో ▸

ఇఫ్తార్ 6-33 (శనివారం సాయంత్రం)
సహర్ 5-02 (ఆదివారం తెల్లవారుజామున)
రంజాన్ వేళలు

గరిష్టం/కనిష్టం 38.7/22.1
వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటూ అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

ఒక్క ప్రమోషన్ ప్లీజ్..

రిటైర్మెంట్‌కు వచ్చినా పదోన్నతులు లేని ఎస్ఏలు



ఈ ఫొటోలోని వ్యక్తి పేరు ఫణికుమార్, ఇతను మల్టీజోన్-2 పరిధిలోని నాగర్‌కర్నూల్ జిల్లా మంగనూరులోని జెడ్పీహెచ్ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. 30 ఏళ్లకు పైగా సర్వీస్ ఎక్స్ పీరియన్స్ ఉన్నా.. ఒక్క ప్రమోషన్‌కు నోచుకోలేదు. గతేడాది సెప్టెంబర్‌లో పదోన్నతులకు అప్పటి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినా.. పలువురు కోర్టుకు వెళ్లడంతో ప్రక్రియ నిలిచిపోయింది. ఇటీవలే హైకోర్టు స్టే తొలగించగా.. పదోన్నతి వస్తుందనే సంతోషంలో ఉన్న ఆయనకు లోక్‌సభ ఎన్నికల కోడ్ గుదిబండగా మారింది. ఈ నెలాఖరులో రిటైర్మెంట్ కానుండగా.. ఆర్థిక నష్టంతో పాటు ఒక్క ప్రమోషన్ లేకుండానే ఉద్యోగ విరమణ చేయాల్సి వస్తోందని వాపోతున్నారు.

..ఇది ఒక్క ఆ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడి సమస్య కాదు.. మల్టీ జోన్-2 పరిధిలోని వందలాది గురువుల దుస్థితి ఇది. పదేళ్లుగా గెజిటెడ్ హెడ్మాస్టర్లుగా పదోన్నతులు, బదిలీలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న దక్షిణ తెలంగాణకు చెందిన స్థానిక సంస్థల పరిధిలోని స్కూల్ అసిస్టెంట్లపై 'సాక్షి' కథనం..

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

- జిల్లాల విభజన, జోనల్ సమస్యలు, కోర్టు స్టేతో అడ్డంకులు
- సుమారు 10 ఏళ్ల నుంచి నిరీక్షిస్తున్న మల్టీ జోన్-2లోని ఉపాధ్యాయులు
- ఈ నెలాఖరు, వచ్చే నెలలో సుమారు 100 మంది ఉద్యోగ విరమణ
- హైకోర్టులో స్టే వెకేట్‌తో ఆనందం.. లోక్‌సభ ఎన్నికల కోడ్‌పై బెంబేలు
- సీఎం రేవంత్ దృష్టి సారించి వెంటనే ప్రక్రియ చేపట్టాలని వేడుకోలు



తొలి నుంచీ అడ్డంకులే..

జిల్లాలు, జోనళ్ల విభజన, తదితర సమస్యలతో పదోన్నతుల ప్రకియలో జాప్యానికి తోడు కోర్టు స్టే అడ్డంకులు మల్టీజోన్-2 పరిధిలోని స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారాయి. ఎట్టకేలకు సుమారు పదేళ్ల తర్వాత గత ఏడాది జనవరి 28న అప్పటి ప్రభుత్వం జీఓ ఎంఎస్ నంబర్ 5 జారీ చేయగా విద్యాశాఖ పదోన్నతులు, బదిలీల ప్రక్రియకు సంబంధించి షెడ్యూల్ ప్రకటించింది. అయితే యూనియన్ ఆఫీస్ బేరర్లకు అదనపు పాయింట్లు ఇవ్వొద్దని, ఇది నిబంధనలకు విరుద్ధమని పలువురు టీచర్లు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు స్టే ఇవ్వడంతో పదోన్నతులు, బదిలీల ప్రక్రియకు బ్రేక్ పడింది. ఆ తర్వాత అదే ఏడాది ఆగస్టులో యూనియన్ ఆఫీస్ బేరర్లకు అదనపు పాయింట్లు ఇవ్వడం లేదని, వారిని సాధారణ టీచర్లగానే పరిగణిస్తామని ప్రభుత్వం తరపు న్యాయవాది హైకోర్టుకు విన్నవించగా.. కోర్టు స్టే తొలగించింది. ఈ మేరకు బదిలీలు, పదోన్నతులకు అవకాశం లభించింది. తొలుత గెజిటెడ్ హెడ్మాస్టర్లకు బదిలీలు జరగగా.. వారు కొత్త స్థానాల్లో నియామకమయ్యారు. ఆ తర్వాత ఎస్ఏలకు జీహెచ్ఎంలుగా ప్రమోషన్ల ప్రక్రియ సాగుతుండగా.. రంగారెడ్డి జిల్లాకు చెందిన పలువురు ఉపాధ్యాయులు హైకోర్టును ఆశ్రయించారు. జిల్లా కేడర్ స్ట్రెంత్ కన్నా అదనంగా ఉపాధ్యాయులు తమ జిల్లాకు వచ్చారని.. 1:2 లిస్ట్ కరెక్ట్ లేదని.. తమకున్న ప్రమోషన్ అవకాశాలను పోగొట్టుకోవాల్సి వస్తుందని వారు హైకోర్టుకెళ్లగా.. కోర్టు స్టే ఇచ్చింది. దీంతో మల్టీ జోన్-2 పరిధి (హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, నల్లగొండ, సూర్యాపేట, భువనగిరి, జనగామ)లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయ పోస్టుల్లో పదోన్నతుల ప్రక్రియ నిలిచిపోయింది. మల్టీ జోన్-1 (ఉత్తర తెలంగాణ)లో మాత్రం జీహెచ్ఎంలుగా స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు పదోన్నతులు పొందారు. ఎట్టకేలకు ఈ నెల 11న హైకోర్టులో స్టే వెకేట్ కాగా.. మల్టీ జోన్-2 పరిధిలో బదిలీలు, పదోన్నతులకు ఆటంకం తొలిగింది.

ఈ రెండు నెలల్లో 112 మంది రిటైర్మెంట్..

ఎట్టకేలకు మల్టీ జోన్-2 పరిధిలో బదిలీలు, పదోన్నతులకు లైన్‌క్లియర్ అయింది. నాలుగు రోజుల క్రితం హైకోర్టులో స్టే వెకేట్ అయినప్పటికీ.. ప్రభుత్వం పదోన్నతులకు సంబంధించి షెడ్యూల్ ప్రకటించకపోవడంపై ఉపాధ్యాయుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ నెల చివరన, వచ్చే ఏప్రిల్, మే నెలల్లో 100 నుంచి 120 మంది వరకు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ పొందనున్నారు. రేపో, ఎల్లుండో లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి రానుండడంతో వారిలో ఆందోళన నెలకొంది. కోడ్ అమల్లోకి వచ్చిన పక్షంలో ఇన్నాళ్లు ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా ఒక్క పదోన్నతి లేకుండా రిటైర్మెంట్ కావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని విద్యాశాఖ, కీలక నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల కోడ్‌లోపే స్పందించి.. వెంటనే పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించాలని కోరుతున్నారు.

సీఎం రేవంత్ రెడ్డి దృష్టి సారించాలి..



మల్టీజోన్-2 పరిధిలో సుమారు 700 మంది స్కూల్ అసిస్టెంట్ టీచర్లు పదేళ్లుగా జీహెచ్ఎం పదోన్నతుల కోసం నిరీక్షిస్తున్నారు. ఎట్టకేలకు అడ్డంకులు తొలగాయి. ఈ రెండు నెలల్లో 114 మంది స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ పొందనున్నారు. వారిని దృష్టిలో పెట్టుకుని అయినా.. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి రాక మునుపే పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించాలి. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి విద్యాశాఖకు తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరుతున్నాం.

– గోపీనాథ్, స్కూల్ అసిస్టెంట్ టీచర్, పదోన్నతుల సాధన కమిటీ అధ్యక్షుడు, గద్వాల బాయ్స్ హైస్కూల్

పాలమూరుపై బీజేపీ ఫోకస్

నేడు నాగర్‌కర్నూల్‌కు ప్రధాని మోదీ

- మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నల్లగొండ స్థానాలే లక్ష్యంగా బహిరంగసభ
- భారీ జనసమీకరణకు నేతల సన్నాహాలు.. సభాస్థలిలో ఏర్పాట్లు పూర్తి
- పోలీసుల భారీ బందోబస్తు.. ఎంపీ అభ్యర్థులు డీకే అరుణ, భరత్ స్వీయ పర్యవేక్షణ



నాగర్‌కర్నూల్‌లో ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభకు సిద్ధమవుతున్న వేదిక

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: తెలంగాణలో పట్టు సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న బీజేపీ.. ప్రధానంగా ఉమ్మడి పాలమూరుపై ఫోకస్ పెట్టింది. గత ఏడాది డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మహబూబ్‌నగర్ కేంద్రంగా సమరశంఖం పూరించిన విషయం తెలిసిందే. తాజాగా లోక్‌సభ ఎన్నికల వేళ, షెడ్యూల్ విడుదల క్రమంలో శనివారం ఉమ్మడి జిల్లాలోని నాగర్‌కర్నూల్‌కు రానున్నారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నల్లగొండ పార్లమెంట్ స్థానాలే లక్ష్యంగా బీజేపీ నిర్వహిస్తున్న భారీ బహిరంగసభకు ఆయన హాజరుకానున్నారు. ఈ మేరకు కొల్లాపూర్ చౌరస్తా సమీపంలోని మైదానంలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

సుమారు 2 లక్షల జనసమీకరణ..

మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నల్లగొండ పార్లమెంట్ స్థానాలే లక్ష్యంగా బీజేపీ నాగర్‌కర్నూల్‌లో నిర్వహించనున్న బహిరంగసభకు ఆ పార్టీ నేతలు భారీ జనసమీకరణ చేపట్టారు. సుమారు రెండు లక్షల మందిని తరలించేలా ఏర్పాట్లు చేశారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌లోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఒక్కో నియోజకవర్గం నుంచి 15 వేలు.. మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఒక్కో సెగ్మెంట్ నుంచి 10 వేలు.. నల్లగొండ పార్లమెంట్‌లోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఒక్కో నియోజకవర్గం నుంచి ఐదు వేల చొప్పున జనాలను తరలించేందుకు వాహనాలు సమకూర్చినట్లు పార్టీలోని విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.



పోలీసుల భారీ బందోబస్తు

నాగర్‌కర్నూల్‌కు ప్రధాని మోదీ రానున్న నేపథ్యంలో పోలీసులు అలర్ట్ అయ్యారు. భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. నలుగురు ఎస్పీల పర్యవేక్షణలో ముగ్గురు ఏఎస్పీలు, 11 మంది డీఎస్పీల ఆధ్వర్యంలో 28 మంది సీఐలు, 72 మంది ఎస్ఐలు, 164 మంది ఏఎస్ఐలు/హెడ్‌కానిస్టేబుళ్లు విధులు నిర్వర్తించనున్నారు. 313 మంది కానిస్టేబుళ్లు/హోంగార్డులతో పాటు 67 మంది మహిళా పోలీసులు మొత్తం 662 మంది, ఎనిమిది ప్లాటూన్ల బలగాలు బందోబస్తు విధుల్లో పాల్గొననున్నాయి.

ప్రధాని మోదీ పర్యటన షెడ్యూల్ ఇలా..

- **ఉదయం 10.45 గంటలు:** హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ నుంచి బేగంపేటకు బయలు దేరుతారు.
- **11 గంటలు :** విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో నాగర్‌కర్నూల్‌కు బయలు దేరుతారు.
- **11.50 గంటలు :** కొల్లాపూర్ చౌరస్తాలో సభా వేదిక వెనుక వైపు ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- **మధ్యాహ్నం 12 గంటలు:** హెలిప్యాడ్ నుంచి కాన్వాయ్‌లో సభా వేదిక పైకి చేరుకుంటారు.
- **12.05 -12.45 గంటలు :** ప్రజలనుద్దేశించి ప్రసంగం..
- **ఒంటి గంట:** హెలికాప్టర్‌లో కర్ణాటక రాష్ట్రంలోని కలబురిగికి పయనం..

లోక్‌సభ అభ్యర్థులు, నేతల పర్యవేక్షణ..

ఉమ్మడి పాలమూరులోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానాలను కైవసం చేసుకునే లక్ష్యంతో బీజేపీ అధిష్టానం అన్ని పార్టీల కంటే ముందుగానే అభ్యర్థులను ప్రకటించింది. పలు సర్వేల ఆధారంగా నాగర్‌కర్నూల్‌లో బీఆర్ఎస్‌కు చెందిన ఎంపీ రాములును పార్టీలో చేర్చుకుని.. ఆయన తనయుడు భరత్ ప్రసాద్‌ను ఎంపీ అభ్యర్థిగా ప్రకటించింది. మహబూబ్‌నగర్ అభ్యర్థిగా మాజీ మంత్రి, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణకు టికెట్ ఖరారు చేయగా.. ఇరువురు అభ్యర్థులతోపాటు ఎంపీ రాములు, నాగర్‌కర్నూల్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు స్వయంగా మోదీ సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థులు డీకే అరుణ, భరత్ ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభాకర్, వనపర్తి జెడ్పీచైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి

వాహనాల పార్కింగ్ ఇలా..

ప్రధాని నరేంద్రమోదీ సభకు వచ్చిన వాహనదారులు ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలిపివేసి ఇతరులకు ఇబ్బందులు కలిగించకుండా పోలీసుశాఖకు సహకరించాలని నాగర్‌కర్నూల్ ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అచ్చంపేట, కల్వకుర్తి వైపు నుంచి బహిరంగసభకు వచ్చే వాహనాలను గాయత్రి ఆస్పత్రి వెనుక, సబ్‌స్టేషన్ వద్ద ఉన్న లక్ష్మి నర్సింహస్వామి దేవాలయం వద్ద పార్కింగ్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. బిజినేపల్లి, తాడూరు వైపు నుంచి వచ్చే వాహనాలు నెల్లికొండ మార్కెట్ యార్డ్‌లో, కొల్లాపూర్ వైపు నుంచి వచ్చే వాహనాలను సఖిసెంటర్ వద్ద పార్కింగ్ చేయాలని సూచించారు. బహిరంగ సభకు వచ్చే వాహనాల పార్కింగ్ స్థలాలతో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనాలకు సంబంధించి దారి మళ్లింపుపై పోలీసు శాఖ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

న్యూస్‌రీల్

పరిశోధన పద్ధతులపై వర్క్‌షాప్



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో పరిశోధన పద్ధతులపై ఒకరోజు వర్క్‌షాప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ రాజ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. పరిశోధలు జరగాలంటే వాటిపై పరిశోధన విధానం, పద్ధతులపై విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్ పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. పలు రీసెర్చ్ పద్ధతుల గురించి తెలుసుకోవడం వల్ల సులభమైన విధానాల ద్వారా రీసెర్చ్ చేసేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి, అధ్యాపకులు అర్జున్‌కుమార్, కన్వీనర్ ఈశ్వరయ్య, మహ్మద్ సులేమాన్, నాగరాజుచారి తదితరులు పాల్గొన్నారు.

ఒకటో తరగతి ప్రవేశానికి లక్కీ డ్రా

మహబూబ్‌నగర్ న్యూటౌన్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 2024- 25 విద్యా సంవత్సరానికి గాను ఒకటో తరగతి ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశం కోసం అర్హులైన గిరిజన, ఎస్సీ విద్యార్థుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఎంపిక చేసేందుకు విడివిడిగా లక్కీ డ్రా నిర్వహించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఎం.చత్రునాయక్, విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో లక్కీ డ్రా నిర్వహించారు. గిరిజన విద్యార్థుల నుంచి వచ్చిన 11 దరఖాస్తులకు గాను 5 మంది విద్యార్థులను లక్కీ డ్రా నిర్వహించి ఎంపిక చేశారు. ఇందులో కోయిల్‌కొండ మండలం లింగంపల్లికి చెందిన కావ్య సుధ, అంకిళ్లకు చెందిన వి.కావ్య, హన్వాడ మండలం సల్లోనిపల్లికి చెందిన కె.శ్రీలక్ష్మి, మహబూబ్‌నగర్ మండలం బోయపల్లికి చెందిన వి.నరేందర్, రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడకు చెందిన వి.సాత్విక్‌లను ఎంపిక చేశారు. అలాగే ఎస్సీ విద్యార్థుల నుంచి 14 దరఖాస్తుల నుంచి లక్కీ డ్రా తీసి చిట్యాల మన్వీత్‌ను ఎంపిక చేశారు.

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



జిల్లా విద్యాశాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

- కలెక్టర్ కోయ శ్రీహర్ష
- జిల్లాలో మొత్తం 38 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 7,678 మంది విద్యార్థులు

నారాయణపేట: ఈ నెల 18 తేది నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ తన చాంబర్‌లో పదో తరగతి పరీక్షలపై అధికారులతో మాట్లాడారు. ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 1వ తేది వరకు జిల్లాలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షలు నిర్వహించబడుతాయని తెలిపారు. జిల్లాలో 7,678 మంది రెగ్యులర్ 95 మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలు రాస్తారని, 38 పరీక్షా కేంద్రాల్లో పరీక్షల పకడ్బందీ నిర్వహణకుగాను 38 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, 38 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు ఉంటారన్నారు. అలాగే క్షేత్ర స్థాయి పర్యవేక్షణకు ఫ్లెయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. తహసీల్దార్లు పరీక్ష సమయాల్లో సంబంధిత పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించాలని, 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు కేంద్రాలు, మండల ప్రధాన కార్యాలయాల సమీపంలోని జిరాక్స్ దుకాణాలను మూసివేయలని ఆదేశించారు.

కేంద్రాల వద్ద 144 సెక్షన్

పరీక్ష కేంద్రాల దగ్గర 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల దగ్గర తాగునీటి వసతి ఏర్పాటు చేయాలన్నారు. పోలీసు బందోబస్తుతో పరీక్షలు పూర్తయ్యాక ప్రశ్నపత్రాలను తరలించాలన్నారు. జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల వద్ద అవసరమైన మందులతో వైద్య బృందాలను ఏర్పాటు చేయాలని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని ఆదేశించారు. పరీక్ష సమయంలో అన్ని పరీక్షా కేంద్రాలకు అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరాను అందించాలని విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీరును ఆదేశించారు. సకాలంలో పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల సౌకర్యార్థం ఉదయం బస్సుల ఫ్రీక్వెన్సీని పెంచాలని, పరీక్షా కేంద్రాలకు అదనంగా ప్రత్యేక బస్సులను నడపాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఈఓ ఘని, సంబంధిత అధికారులు శ్రీనివాస్, రమేశ్‌శెట్టి తదితరులు ఉన్నారు.

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూ సర్వే

ప్రస్తుత పరిస్థితిలో భూ సర్వే చేయడానికి అత్యాధునిక పరిజ్ఞానం ఉపయోగించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. ఇటీవల కొనుగోలు చేసిన డీజీపీఎస్ పరికరాన్ని శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా సర్వే అధికారులకు అందజేసి, డీజీపీఎస్ పనితీరు అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ భూముల సర్వే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేసి హద్దులు నిర్ణయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ అశోక్‌కుమార్, జిల్లా సర్వే అధికారి గిరిధర్, డిప్యూటి ఇన్స్పెక్టర్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి



కోటకొండ నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ

నారాయణపేట రూరల్: వేసవి కాలం దృష్ట్యా నర్సరీలో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ సూచించారు. శుక్రవారం మండలంలోని కోటకొండ శివారులోని నర్సరీని ఆమె అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏయే మొక్కలు అందుబాటులో ఉన్నాయని, టార్గెట్‌కు తగ్గట్లు మొక్కలు ఉంచాలన్నారు. వర్షాలు ప్రారంభమయ్యే నాటికి పూర్తిస్థాయిలో అందించేవిధంగా తగిన చర్యలు చేపట్టాలన్నారు. జీవామృతాన్ని తయారుచేసి తగిన మోతాదులో మొక్కలుకు వేస్తే పెరుగుదల బాగా ఉంటుందన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ వెంకటయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ అశోక్‌కుమార్

నారాయణపేట: వినియోగదారుల హక్కులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జిల్లా రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మానవ జీవితంలో వస్తు వినియోగం తప్పనిసరి అని, ఏదైనా ఒక వస్తువు కొని, ఆ వస్తువు నకిలీ లేదా నాసిరకం అయితే ఆ వస్తువుని అమ్మిన వ్యాపారిపై లేదా ఉత్పత్తిదారులపై వినియోగదారుల ఫోరంలో కేసు వేసి నష్టపరిహారం పొందవచ్చన్నారు. అదే విధంగా జడ్పీ సీఈఓ శైలజా మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల చట్టాన్ని క్షేత్రస్థాయిలో అమలు జరిగేలా చూడాలని చెప్పారు. ప్రతి రెండు నెలలకు ఒక సారి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేయాలన్నారు. ఈ చట్టం పై జీసీడీఓ పద్మనళిని, డీఏఓ జాన్‌సుధాకర్, ఆరోగ్యశాఖ తరపున బిక్షపతి క్లుప్తంగా వివరించారు. అంతకుముందు వినియోగదారుల హక్కులపై ఫోరం సభ్యుడు లడ్డి అశోక్, హజమ్మ, బాల్‌రాజ్‌లు మాట్లాడారు. పుట్టిన పిల్లాడి నుంచి చనిపోయే వరకు అందరూ వినియోగదారులే అవుతారన్నారు. కల్తీ రహిత సమాజాన్ని నిర్మించాలంటే ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని వారు పేర్కొన్నారు. డీఎస్ఓ సుదర్శన్ మాట్లాడుతూ ఈ సమావేశంలో చర్చించిన అంశాలన్నింటిని కలెక్టర్‌కు నివేదించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ రాజేశ్వరి, డీసీహెచ్ఓ, వినియోగదారుల ఫోరం సభ్యులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డీఎస్సీకి సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఎస్సీ సంక్షేమశాఖ అధికారి పాండు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 టీఆర్‌టీకి దరఖాస్తు చేసుకున్న వారు, టెట్ అర్హత సాధించిన వారు అర్హులన్నారు. ఈ నెల 26లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

వందరోజుల్లో ఒక్క పునాది రాయి వేశారా?

మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి

నారాయణపేట: కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చి వంద రోజుల్లో అయ్యిందని.. నియోజకవర్గ విషయానికి వస్తే వంద రోజుల్లో ఒక్క అభివృద్ధి పనికైనా పునాది రాయి పడిందా అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణ మాఫీ ఎక్కడ జరిగిందని ప్రశ్నించారు. కొడంగల్‌కు రూ.కోట్ల నిధులు తెచ్చుకొని.. నారాయణపేటకు ఒక్క రూపాయి అయినా కేటాయించారా చెప్పాలన్నారు. పేట నియోజకవర్గ అభివృద్ధికి నిధులు అడిగేందుకు పాలకులు ముందుకు రాకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో మంజూరు చేసి నిర్మించిన వాటిని ప్రస్తుత పాలకులు ప్రారంభోత్సవాలు చేశారన్నారు. మెడికల్ కళాశాల భవన నిర్మాణం ఎందుకు జాప్యం జరుగుతుందని ప్రశ్నించారు. మెడికల్ కళాశాల, జిల్లా ఆస్పత్రి నిర్మాణాలకు నారాయణపేట మండలంలోని జాజాపూర్ గ్రామానికి చెందిన పలువురు రైతులు వారి భూములను ప్రభుత్వానికి అప్పగించారన్నారు. వారికి రావాల్సిన రూ.2.29 కోట్లు పరిహారం చెల్లించడంలో ప్రభుత్వం తాత్సారం చేయడం సరి కాదన్నారు. వెంటనే వారికి పరిహారం చెల్లించకపోతే రైతులతో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్నిచేపట్టేందుకు బీఆర్ఎస్ పార్టీ ముందడుగు వేస్తోందన్నారు. నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతలకు తాము వ్యతిరేకం కాదని, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులను త్వరిత గతిన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని, ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యా రంటీలను అమలు చేసేంత వరకు ప్రజాపక్షాన బీఆర్ఎస్ ఎప్పుడు పోరాటాలు చేస్తుందన్నారు.

అలసందలు క్వింటా రూ.6,012

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం అలసందలు క్వింటా గరిష్టం , కనిష్టంగా రూ.6,012 ధర పలికింది. అలాగే, పెసర గరిష్టంగా రూ.8,509, కనిష్టంగా రూ.8,391, వేరుశనగ గరిష్టంగా రూ.6,069, కనిష్టంగా రూ.4,500, జొన్నలు గరిష్టంగా రూ.5,159, కనిష్టంగా రూ.2,309, వడ్లు సోనా గరిష్ట, కనిష్టంగా రూ.2,650, ఎర్ర కందులు గరిష్టంగా రూ. 9,940, కనిష్టంగా రూ.8,829, తెల్ల కందులు గరిష్ట, కనిష్టంగా రూ.9,009 ధర పలికాయి.

క్లుప్తంగా

కోళ్లదాణ పరిశ్రమలో సూపర్‌వైజర్ దుర్మరణం

జడ్చర్ల: కోళ్లదాణ తయారీ యంత్రంలో తలెత్తిన సాంకేతిక సమస్యను సరిచేసేందుకు వెళ్లిన ఓ సూపర్‌వైజర్ ప్రమాదానికి గురై దుర్మరణం చెందాడు. ఈ ఘటన జడ్చర్ల మండలం గంగాపూర్ శివారులోని ఓ కోళ్లదాణ పరిశ్రమలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ చంద్రమోహన్ వివరాల మేరకు.. ఏపీలోని ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలం కాకర్ల గ్రామానికి చెందిన నారు వెంకటేశ్వర్‌రెడ్డి (30) కొంతకాలంగా పరిశ్రమలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. రోజువారీగా అతడు విధులకు హాజరు కాగా.. కోళ్లదాణ స్టోరేజీ విభాగంలోని యంత్రంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దాన్ని సరిచేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు యంత్రంలో పడి మృత్యువాత పడ్డాడు. పరిశ్రమ నిర్వాహకులు యంత్రం భాగాలను విడదీసి, మృతదేహాన్ని బయటికి తీశారు. అనంతరం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ఏడాది కిందటే వివాహమైంది. తండ్రి వెంకటనారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా, మృతదేహాన్ని సమీప జడ్చర్ల ఆస్పత్రికి తరలించాల్సి ఉండగా, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించడం.. మృతుడి వివరాలను సంబంధిత పరిశ్రమ నిర్వాహకులు వెల్లడించకపోవడంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి


నాగేష్ (ఫైల్)

ఖిల్లాఘనపురం: చేపల వేటకు చెరువుకు వెళ్లిన ఓ వ్యక్తి నీటిలో మునిగి మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. ఖిల్లాఘనపురం గ్రామానికి చెందిన సింగనమోని నాగేష్ (40) గురువారం మధ్యాహ్నం పొలానికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై చుట్టుపక్కల వెదికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం అన్‌పహడ్ శివారులోని పిరంకాని చెరువు కట్టపై గ్రామస్తులకు దుస్తులు కనిపించడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకొని పరిశీలించగా నాగేష్‌కు చెందినవని నిర్ధారించారు. చెరువులో గాలించగా మృతదేహం కనిపించడంతో బయటకు తీశారు. నాగేష్‌కు భార్య యాదమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీహరి తెలిపారు. మృతదేహానికి మహబూబ్‌నగర్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ వివరించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం

ఆత్మకూర్: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆత్మకూర్ మండలం దేవరపల్లిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నరేందర్ వివరాల మేరకు.. దేవరపల్లికి చెందిన మహేష్ (35)కు గడ్డంపల్లికి చెందిన అనితతో పదేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కొన్ని రోజులుగా భార్యపై అనుమానం పెంచుకున్న మహేష్.. తరుచూ గొడవ పడుతుండేవాడు. ఈక్రమంలో ముష్టిపల్లికి మకాం మార్చారు. అక్కడే కొన్ని రోజులుగా జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం స్వగ్రామానికి వచ్చిన మహేష్.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు కిందపడి మరొకరు..

మహబూబ్‌నగర్ క్రైం: గుర్తు తెలియని రైలు కిందపడి దినసరి కూలీగా పని చేసే ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే ఎస్ఐ సయ్యద్ అక్బర్ తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా మద్దూర్ మండలం నందిగాం చెందిన పెద్దగొల్ల నాగప్ప(37) రెండు ఏళ్లుగా భార్య, పిల్లలతో కలిసి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని వీరన్నపేటలో అద్దె ఇంట్లో నివాసం ఉంటూ దినసరికూలీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఈనెల 14న అర్ధరాత్రి తర్వాత మద్యం మత్తులో పట్టణంలోని టీడీగుట్ట ఏరియాలోని రైల్వే పట్టాల మీదకు వెళ్లి గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ వెల్లడించారు. మృతుడి భార్య ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాంగ్రెస్, బీజేపీ రెండూ దోపిడీ పార్టీలే



మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

- బీఆర్ఎస్, బీఎస్పీ కలయికతో ఇతర పార్టీలకు వణుకు
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

నాగర్‌కర్నూల్ రూరల్: ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో బీఎస్పీ, బీఆర్ఎస్ పార్టీలు పొత్తు కుదుర్చుకోవడంతో ఇతర రాజకీయ పార్టీలలో వణుకు పుడుతుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. నాగర్‌కర్నూల్‌లో ఉమ్మడి అభ్యర్థిగా తనను ఎంపీగా గెలిపిస్తే పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకనవుతానని పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీ తిరిగి మూడోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందని ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో కాన్షీరాం 90వ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేయడం దుర్మార్గమైన పద్ధతని విమర్శించారు. ఓ వైపు తమిళనాడులో స్టాలిన్ ప్రభుత్వాన్ని తిప్పలు పెడుతుందని, జార్ఖండ్‌లో సోరెన్‌ను అరెస్ట్ చేయించారని అన్నారు. మోదీ పాలనలో దేశ సంపద కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేశారని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ రెండూ దోపిడీ పార్టీలని ఎద్దేవా చేశారు. కేంద్రంలో బీజేపీ బడేమియాగా ఉంటే.. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి చోటాబాయ్‌గా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. మత, మైనార్టీలకు వ్యతిరేకంగా చట్టాలను రూపొందిస్తున్నాయని ఆరోపించారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా బీఎస్పీ అధినేత్రి మాయావతితో కేసీఆర్ చేతులు కలిపారన్నారు. బీఎస్పీ, బీఆర్ఎస్ లౌకిక కూటమితోనే రాజ్యాంగ పరిరక్షణ సాధ్యమన్నారు. ఉత్తరప్రదేశ్‌లో రామాలయాన్ని నిర్మించి అక్షింతలను ఊరూరా పంపిణీ చేసి రామరాజ్యం పేరుతో మళ్లీ గెలవాలనే కుట్ర చేస్తుందని విమర్శించారు. 6,600 కోట్లు ఎలక్ట్రోల్ బాండ్ల పేరుతో ఎస్‌బీఐ నుంచి గుంజుకున్నారని అన్నారు. మళ్లీ బీజేపీకి అధికారం ఇస్తే చీకటి యుగంలోకి పోతామని, బీజేపీని తక్షణం ఓడించి దేశ సరిహద్దుల నుంచి తరమాలని హితవు పలికారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పేరుతో రాష్ట్ర ప్రజలను గారడీ చేస్తున్నారని విమర్శించారు.

కాంగ్రెస్ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోంది

- మెజార్టీ లేకున్నా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడమేంటి?
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి


మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

నారాయణపేట: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బలం లేకున్నా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని నిలబెట్టడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నారాయణపేటలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాహుల్‌గాంధీ పాదయాత్ర చేస్తున్నారు కదా నీతి, విలువలు ఉన్న పార్టీ కాంగ్రెస్ అంటూ గొప్పగా మాట్లాడేవారు.. మెజార్టీ లేకున్నా పోటీ ఎలా చేస్తున్నారనేది ప్రజలకు చెప్పాలని సవాల్ విసిరారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీఎస్పీ కలిసికట్టుగా పోటీ చేయాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ పార్టీ స్వాగతిస్తుందన్నారు. హైదరాబాద్‌తోపాటు నాగర్‌కర్నూల్ నుంచి ఎంపీగా పోటీ చేస్తున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గెలుపు కోసం కృషిచేస్తామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో 1.88 శాతం ఓట్ల తేడాతో తమ పార్టీ అధికారం కోల్పోయిందని, ఎన్నికల్లో జరిగిన లోటుపాట్లను సవరించుకొని ముందుకు వెళ్తామన్నారు.

▪ ఏడాదిన్నర క్రితం జరిగిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కసిరెడ్డి నారాయణరెడ్డి, కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి నామినేషన్ వేస్తే సంఖ్యాబలం లేదని కాంగ్రెస్ పోటీలో నిలబడలేదన్నారు. ఆ రోజు లేని బలం ఈ రోజు ఎక్కడి నుంచి వస్తుందని నిరంజన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఇవి సాధారణ ఎన్నికలు కావని, ఓటర్లే ప్రజాప్రతినిధులు పార్టీ సింబల్‌పై గెలిచినవారన్నారు. మీరు అభ్యర్థిని ఎట్లా పెట్టుకుంటారో ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. డబ్బులు పెడితే గెలుస్తామనే అహంకారమా.. బేరసారాలు ఆడేందుకు ఒకటి, రెండు ఓట్లు కావు.. ఏకంగా 1,400 మందిని కొంటారా అని ప్రశ్నించారు. ఏం చేసినా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

మామ చేతిలో అల్లుడి హతం

- గుట్టుచప్పుడు కాకుండా మృతదేహం వాగులో పూడ్చివేత
- పైగా కనిపించడం లేదని బంధువులకు సమాచారం
- పోలీసులను ఆశ్రయించిన బంధువులు.. తాజాగా వెలుగులోకి


సాయన్న (ఫైల్)


మృతదేహాన్ని వెలికితీస్తున్న పోలీసులు

చిన్నచింతకుంట: గొడవపడి పుట్టింటికి వచ్చిన భార్యను కాపురానికి తీసుకెళ్దామని అత్తారింటికి వచ్చిన అల్లుడిని మామ హతమార్చిన సంఘటన మండలంలోని కురుమూర్తిలో వెలుగుచూసింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలను డీఎస్పీ వెంకటేశ్వర్లు వెల్లడించారు. మూసాపేట మండలం వేముల గ్రామానికి చెందిన సాయన్న(40)కు చిన్నచింతకుంట మండలంలోని కురుమూర్తి గ్రామానికి చెందిన గాయత్రితో వివాహమైంది. అయితే జనవరిలో సాయన్న భార్యతో గొడవపడ్డాడు. దీంతో ఆమె అప్పట్లోనే తల్లిగారింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో ఆదివారం సాయన్న భార్యను తీసుకెళ్లడానికి కురుమూర్తికి వచ్చాడు. అయితే మద్యం తాగి ఇంటికి వచ్చిన మామ వెంకటన్న మంచంపై పడుకున్న సాయన్నను చూసి నా కూతురిని తరుచుగా కొడతావా అంటూ కర్రతో తలపై బలంగా కొట్టాడు. దీంతో సాయన్న అక్కడికక్కడే మృతిచెందాడు. కూతురు గాయత్రి సాయంతో సాయన్నను గోనె సంచిలో మూటకట్టి ఎక్సల్ లూనాపై తీసుకువెళ్లి గ్రామ శివారులోని వాగులో పూడ్చిపెట్టాడు. సాయన్న దుస్తువులను పాడుబడిన బావిలో పడేశారు. అనంతరం సాయన్న కనిపించడం లేదంటూ తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాడు. దీంతో సాయన్న తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ చేపట్టారు. ఈ క్రమంలో అనుమానంతో సాయన్న భార్య గాయత్రి, మామ వెంకటన్నలను గురువారం అదుపులోకి తీసుకుని విచారించగా వారే హతమార్చినట్లు ఒప్పుకున్నట్లు వెల్లడించారు. జడ్చర్ల సీఐ నాగార్జునగౌడ్, తహసీల్దార్ కృష్ణయ్య, ఎస్ఐ శేఖర్ ఆధ్వర్యంలో సాయన్న మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సీఎస్‌ఏటీ ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు

స్టేషన్ మహబూబ్‌నగర్: యూసీఎస్సీ సివిల్స్ సర్వీసెస్ ప్రిలిమ్స్ కం ప్రీ కోచింగ్ 2025 పరీక్ష కోసం 2024– 25 విద్యాసంవత్సరంలో వంద మంది మైనార్టీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి రవీంద్రనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకు రిజర్వేషన్ ప్రకారం మహిళా అభ్యర్థులకు 33 శాతం, అన్ని రిజర్వు కేటగిరీల్లో దివ్యాంగులకు 5 శాతం సీట్లు కేటాయించామన్నారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్‌లో మొదటిసారి ప్రవేశం పొందే అభ్యర్థులందరూ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశం పూర్తిగా మెరిట్ ప్రాతిపదికన ఉంటుందన్నారు. సాధారణ, ప్రొఫెషనల్ డిగ్రీ పూర్తిచేసిన మైనార్టీ అభ్యర్థులు www.tmreistelangana.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా వచ్చేనెల 12 వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 28న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జిల్లాకేంద్రంలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. అర్హులైనవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాల కోసం 040– 23236112 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

హతురాలి వివరాలు లభ్యం



బల్మూర్: అచ్చంపేట-బల్మూర్ ప్రధాన రహదారి పక్కన దారుణ హత్యకు గురైన మహిళ వివరాలు ఎట్టకేలకు లభించాయి. ఈనెల 13న మహిళ మృతదేహం లభ్యం కాగా.. స్థానిక పోలీసులు విచారణ చేపట్టారు. ఈక్రమంలో నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలోని ఎండబెట్లకు చెందిన రేణమ్మ (40)గా గుర్తించారు. మృతురాలి ఆనవాళ్లను కుటుంబ సభ్యులు గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు. మృతురాలు ఈనెల 6న తెల్కపల్లి మండలంలోని పెద్దపల్లిలో ఓ శుభకార్యానికి వెళ్లినట్లు కుటుంబ సభ్యుల ద్వారా తెలుస్తుండగా.. అక్కడి నుంచి ఎవరి వెంట వెళ్లిందనే కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నారు. కాగా సుమారు 50 కి.మీ. దూరంలో ఉన్న బల్మూర్ ప్రాంతంలో ఆమెను అతి కిరాతకంగా హత్యచేసి, ముళ్ల పొదల్లో వేయడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతురాలి భర్త కొన్నేళ్ల కిందట మృతి చెందగా, ఆమెకు సంతానం కూడా లేరని గ్రామస్తుల ద్వారా తెలిసింది.

ఆర్‌యూబీ నిర్మాణం చేపట్టండి


రైల్వే జీఎంకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర: పట్టణంలో నిర్మించిన ఆర్‌ఓబీ వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారని వెంటనే రైల్వే గేటుకు సమీపంలో రైల్వే అండర్ బ్రిడ్జిని నిర్మించాలని కోరుతూ సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌కు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి వినతిపత్రం ఇచ్చారు. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ రైల్వే నిలయంలో జీఎంను కలిసి ఎమ్మెల్యే చర్చించారు. దేవరకద్రలో రైల్వే గేటును పూర్తిగా మూసి వేయడం వల్ల వ్యాపారులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అలాగే బస్టాండ్‌లోకి బస్సులు రాకపోకలు లేకపోవడంతో వ్యాపారాలన్నీ మూతపడే పరిస్థితి వచ్చిందన్నారు. తక్షణమే దేవరకద్రలో అండర్ పాస్ బ్రిడ్జిని నిర్మించాలని కోరారు. ఎమ్మెల్యేతో పాటు టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి ఉన్నారు.

పాలమూరు అభివృద్ధికి పాటుపడతా


తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటున్న వంశీచంద్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు న్యాయయాత్రకు ప్రజలు చూపించిన ప్రేమ, ఆప్యాయత, నాపై ఉన్న విశ్వాసాన్ని దృష్టిలో పెట్టుకొని కల్వకుర్తి నియోజకవర్గంలోని స్వగ్రామం శేరిఅప్పారెడ్డిపల్లిలో ఉన్న నా ఓటుతోపాటు నా భార్య అశ్లేషారెడ్డి ఓటును మహబూబ్‌నగర్ పట్టణానికి మార్చుకున్నట్లు సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. కల్వకుర్తి నుంచి మహబూబ్‌నగర్‌కు ఓటు బదలాయించడానికి వంశీచంద్‌రెడ్డి జిల్లాకేంద్రంలో అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం దరఖాస్తు అందజేశారు. అనంతరం వంశీచంద్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ప్రజల ఆదరణ, వారు చూపిస్తున్న నమ్మకాన్ని మరిచిపోలేనని అన్నారు. పార్టీ కార్యకర్తలు నన్ను కంటికి రెప్పలా చూసుకుంటున్నారని, వారి రుణం తీర్చుకుంటానని తెలిపారు. మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గ ప్రజలు నన్ను ఆదరించి ఎంపీగా గెలిపిస్తే పూర్తి సమయాన్ని నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమానికి కేటాయిస్తానని చెప్పారు. ఆయన వెంట టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, జిల్లా మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్ తదితరులున్నారు.

గ్యాస్ పైపులైన్ మార్గంలో తవ్వకాలు చేపట్టరాదు



మాట్లాడుతున్న జనరల్ మేనేజర్ నర్సింగ్‌రావు

భూత్పూర్: మండలంలోని వివిధ గ్రామాల్లో పొలాల నుంచి గ్యాస్ పైపులైన్ మార్గం ఏర్పాటు చేశామని, రైతులు తవ్వకాలు చేపట్టరాదని హెచ్‌పీసీఎల్ జీఎం నర్సింగారావు అన్నారు. శుక్రవారం మండలంలోని తాటిపర్తి సమీపంలో హెచ్‌పీసీఎల్ స్టేషన్ వద్ద గ్యాస్ పైపులైన్ లీకయితే చేపట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందితో మాక్ డ్రిల్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, అధికారులు, రైతులను ఉద్దేశించి మాట్లాడారు. కర్ణాటకలోని హసన్ నుంచి హైదరాబాద్‌లోని చర్లపల్లి వరకు గ్యాస్ పైపులైన్ మార్గం ఉందన్నారు. పైపులైన్ మార్గంలో 18 మీటర్ల వెడల్పులో బోర్లు వేయడం, సాగునీటి కోసం తవ్వకాలు చేపట్టరాదని, పెద్ద చెట్లు పెంచకూడదన్నారు. తాటిపర్తి, కొత్తూర్, కొత్త మొల్గర, పాత మొల్గర, భూత్పూర్ మీదుగా ఈ పైపులైన్ ఉందన్నారు. గ్యాస్ లీకేజీ సమస్య ఏర్పడితే అక్కడక్కడ ట్రోల్‌ఫ్రీ నంబర్‌తో కూడిన బోర్డులు ఏర్పాటు చేయడం చేశామని, ప్రతి నిత్యం 16 కిలోమీటర్ల వరకు కంపెనీకి చెందిన ఉద్యోగి పర్యవేక్షిస్తుంటారని వివరించారు. ఏదైన సమస్య తెలిస్తే టోల్ ఫ్రీ నంబరు 8712611489 సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ బాబురావు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ మనోహర్‌రెడ్డి, డివిజనల్ ఫైర్ ఆఫీసర్ కిశోర్, సెఫ్టీ ఇంజినీర్ విద్యసాగర్, సురేష్, శ్రీధర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన జితేందర్‌రెడ్డి


సీఎం రేవంత్‌రెడ్డితో జితేందర్‌రెడ్డి, పార్లమెంట్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, వాకిటి శ్రీహరి, పర్ణికారెడ్డి తదితరులు

- ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అధికార ప్రతినిధిగా నియామకం

స్టేషన్ మహబూబ్‌నగర్: మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి బీజేపీకి గుడ్‌బై చెప్పి.. హస్తం గూటికి చేరారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో ఆయన తనయుడు మిథున్‌రెడ్డితో కలిసి జితేందర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అంతకుముందు ఆయనను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి (దేవరకద్ర), వాకిటి శ్రీహరి (మక్తల్), పర్ణికారెడ్డి (నారాయణపేట), వీర్లపల్లిశంకర్ (షాద్‌నగర్), మహబూబ్‌నగర్ లోక్‌సభ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి తదితరులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వెంటనే జితేందర్‌రెడ్డిలో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అధికార ప్రతినిధితో పాటు ప్రభుత్వ సలహాదారుడి (క్రీడావ్యవహారాలు)గా నియమించారు.

జీరో టికెట్ ఇవ్వలేదని మహిళల ఆందోళన


మద్దూరు బస్టాండ్‌లో కండక్టర్‌ను నిలదీస్తున్న ప్రయాణికులు

మద్దూరు: జీరో టికెట్ బదులు డబ్బుల టికెట్ ఇవ్వడంతో మహిళలు ఆందోళన చేపట్టిన ఘటన మద్దూరు బస్టాండ్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నారాయణపేట నుంచి పరిగి మీదుగా హైదరాబాద్ వెళ్లే నారాయణపేట డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సులో దామరగిద్ద, క్యాతన్‌పల్లి స్టేజీల వద్ద వివిధ ప్రాంతాలకు వెళ్లడానికి మహిళలు బస్సు ఎక్కారు. వారి ఆధార్ కార్డులు చూసి జిరాక్స్ కాపీలని.. డబ్బులు చెల్లించి టికెట్ తీసుకోవాలని కండక్టర్ రఘువీర్ కోరారు. ఇందుకు ససేమిరా అనడంతో డబ్బులివ్వాలని లేదంటే దిగిపోవాలని సూచించడంతో టికెట్ తీసుకున్నారు. కండక్టర్‌కు ఆధార్‌తో పాటు ఓటరు ఐడీ చూపించినా జీరో టికెట్ ఇవ్వలేదని క్యాతన్‌పల్లికి చెందిన శిరీషా చెప్పారు. అనంతరం మద్దూరు బస్టాండ్‌లో మహిళలు, ఇతర ప్రయాణికులు ఆందోళనకు దిగారు. ఇదే విషయాన్ని డిపో మేనేజర్ లక్ష్మి వద్ద ప్రస్తావించగా.. ఆధార్‌కార్డు, ఓటరు ఐడీ, బ్యాంకు పట్టాదారు పాసుపుస్తకం, డ్రైవింగ్ లైసెన్సు ఇతర గుర్తింపు కార్డుల్లో ఏవైనా ఒరిజినల్ ఉండాలని పేర్కొన్నారు. జిరాక్స్ ఉండే జీరో టికెట్ ఇవ్వడం కుదరదని వివరించారు.

నానో యూరియాతో పంటలకు మేలు



తెలకపల్లి: నానో యూరియాతో పంటలకు మేలు చేకూరుతోందని పాలెం వ్యవసాయ కళాశాల రావేప్ విద్యార్థులు అన్నారు. శుక్రవారం గౌరెడ్డిపల్లిలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించడంలో ఎరువుల ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. ఇటీవల మార్కెట్‌లోకి వచ్చిన నానో యూరియా పంటలో నత్రజని శాతం నెరవేర్చడంతో పాటు కిరణజన్య సంయోగక్రియ, వేరు, పిల్లర్లు, శాఖల పెంపుదల సమర్థవంతంగా ఉంటుందన్నారు. తద్వారా రైతులకు పెట్టుబడి తగ్గి.. పంట దిగుబడి పెరుగుతుందన్నారు.

సకాలంలో హాజరుకాని ఉపాధ్యాయులు


పాఠశాల ఆవరణలో నిరీక్షిస్తున్న విద్యార్థులు

- గంటల తరబడి వేచి ఉన్న విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులు పాఠశాలకు వచ్చి గంటల తరబడి ఎదురుచూసినా ఉపాధ్యాయులు రాని ఘటన జిల్లాలోని దేవరకద్ర మండలం లక్ష్మీపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. వేసవి నేపథ్యంలో ప్రభుత్వం పాఠశాలలను ఒంటిపూట నిర్వహించేందుకు ఉత్తర్వులివ్వడంతో ఉదయం 8 గంటలకు ప్రార్థన ప్రారంభం కావాల్సి ఉంది. కానీ పాఠశాలలో ఉన్న ఆరుగురు ఉపాధ్యాయులు ఉదయం 8.45 వరకు విధులకు హాజరుకాకపోవడంతో అక్కడే ఉండే అటెండర్ ప్రార్థన చేయించారు. అనంతరం 9.15 వరకు పాఠశాల ఆవరణలో విద్యార్థులు ఆడుకుంటూ కనిపించారు. ఈ విషయాన్ని హెచ్‌ఎం సల్వాచారి వద్ద ప్రస్తావించగా.. గురువారం రాత్రి 12.30 వరకు పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం నిర్వహించామని, దీంతో ఉపాధ్యాయులు సమయానికి హాజరుకాలేదని సమాధానమిచ్చారు. ఇద్దరు మహిళా ఉపాధ్యాయులకు సెలవు ఇచ్చామని.. మరో ముగ్గురు ఆలస్యంగా వచ్చారన్నారు. డీఈఓ రవీందర్‌ను వివరణ కోరగా.. వీడ్కోలు కార్యక్రమం ఆదివారం, రెండో శనివారం మాత్రమే నిర్వహించాలన్నారు. ఏ కార్యక్రమం ఉన్నా.. ఉదయం 8 వరకు పాఠశాల తెరిచి తరగతులు బోధించాల్సిందేనని.. సంబంధిత పాఠశాల హెచ్‌ఎంపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.


వెలుగొమ్ముల ప్రాథమికోన్నత పాఠశాల వద్ద 8.30కి ఉపాధ్యాయుల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు



వేములలో 8.20 గంటలకు తెరుచుకోని పాఠశాల తలుపులు

సమయపాలన ఏది?

- సకాలంలో తెరుచుకోని పాఠశాలలు.. ఉపాధ్యాయుల కోసం విద్యార్థుల ఎదురుచూపులు

మిడ్జిల్: సమాజంలో గురువులకు ఉన్న ప్రాధాన్యత మరెవరికీ లేదు.. కాని వారే విధులను నిర్లక్ష్యం చేస్తూ తుతూమంత్రంగా నిర్వహిస్తున్నారనడానికి ఇదే నిదర్శనం. శుక్రవారం నుంచి పాఠశాలలకు ఒంటిపూట బడులు ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా.. 8.30 వరకు కూడా పాఠశాలల తలుపులు తెరుచుకోలేదు. దీంతో విద్యార్థులు ఉపాధ్యాయుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యార్థులను గాడిన పెట్టాల్సిన ఉపాధ్యాయులే ఇలా దారితప్పితే ఎలా అని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.